సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



అలుగు పోస్తున్న చెరువులు
శాలిగౌరారం మండలంలోని ఎస్‌జీ కొత్తపల్లి చెరువులు పూర్తిస్థాయిలో నిండి అలుగు పోస్తున్నాయి.
- 8లో



ప్రమాదకరంగా కాజ్‌వేలు
ఆత్మకూరు(ఎం) పరిధిలోని బిక్కేరు వాగుపై నిర్మించిన లోలెవల్ కాజ్‌వేలు ప్రమాదకరంగా మారాయి.
- 9లో



హోరాహోరీగా క్రీడా పోటీలు
రాజాపేట ఎస్సీ గురుకులంలో నిర్వహిస్తున్న 9వ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు హోరాహోరీగా కొనసాగాయి.
-10లో

న్యూస్‌రీల్

ఓటరు జాబితా పక్కాగా రూపొందించాలి

సాక్షి,యాదాద్రి: అర్హులకు ఓటు హక్కు కల్పిస్తూ ఓటరు జాబితాను పక్కాగా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. ఓటరు ధ్రువీకరణ, జాబితా తయారీ వంటి పలు అంశాలపై సోమవారం ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. 2024 జనవరి 6 ముసాయిదా జాబితా విడుదల చేసి, ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా ప్రకటించాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం ఓటరు జాబితా రూపకల్పన కీలక పాత్ర పోషిస్తుందని అర్హులైన వారందరికీ తప్పనిసరిగా ఓటుహక్కు కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జండగే, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ నాగేశ్వరచారి పాల్గొన్నారు.

నేడు కార్తీక వన భోజనాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మంగళవారం కార్తీక మాసం అమావాస్య సందర్భంగా మల్లాపురం శివారులోని దేవస్థానం తోటలో కార్తీక వన భోజనాలను ఏర్పాటు చేయనున్నట్టు ఆలయ ఈఓ గీతారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు శ్రీసత్య నారాయణస్వామి వ్రత పూజను నిర్వహించిన అనంతరం వన భోజనాల కార్యక్రమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఆలయ అధికారులు, సిబ్బందితో పాటు మీడియా ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

భువనగిరి టౌన్: ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలి ఎమ్మార్పీఎస్(ఎం) రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్‌వీ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో రంగాపురం స్వామి మాదిగ, శంకర్, రమేష్, శ్రీనివాస్, మహేందర్, పోతరాజు శేఖర్, కోట చిన్నస్వామి, వెల్మజాల యాదగిరి, దుబ్బాసి కుమార్, వడ్డేపల్లి యాదగిరి, కూరెళ్ల చిన్న, బండెల శ్రీను పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌కు చేరిన ఈవీఎంలు



భువనగిరిలో ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ వద్ద పోలీసుల నిఘా

భువనగిరి: ఎన్నికల ఫలితాల అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఈవీఎంలను తిరిగి స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఈవీఎంలతోపాటు వీవీ ప్యాట్లు, పోస్టల్ బ్యాలెట్లు, వీవీ ప్యాట్లలోని చీటీలు, మాక్ పోలింగ్ ధ్రువపత్రాలు, పీఓ డైరీ వంటి ఎన్నికల సామగ్రిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూంలో భద్రపర్చారు. వీటిని 45 రోజుల పాటు స్ట్రాంగ్ రూంలో ఉంచిన తర్వాత సాధారణ గోదాంకు చేర్చుతారు. అక్కడ కూడా వీటిని ఐదేళ్ల పాటు భద్రపర్చాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో స్ట్రాంగ్ రూం వద్ద కేంద్ర బలగాలతో పోలీసులతో పాటు లోపలా, బయటా సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు. ఒకవేళ వీటిని ఎన్నికల సంఘం తీసుకోవాలనుకుంటే ఇంజనీర్లను పిలిపించి అందులోని డేటాను తొలగిస్తారు.

45 రోజుల వరకు..

ఓట్ల లెక్కింపు సందర్భంగా స్వల్ప ఆధిక్యతతో ఫలితాలు వస్తే ఓడిపోయిన అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉంటుంది. ఒకవేళ ఎవరైనా న్యాయస్థానానికి వెళ్తే కోర్టు ఆదేశానుసారం ఓట్లను మరోసారి లెక్కించే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలోనే ఎన్నికల సంఘం 45 రోజుల వరకు ఈవీఎంలను స్థానికంగా భద్రపరుస్తోంది.

ప్రాజెక్టులు మానవాళికి ఉపయోగపడాలి

నల్లగొండ: విద్యార్థులు నేర్చుకునే పాఠ్యాంశాలను మానవాళి మనుగడకు ఉపయోగపడేలా ప్రాజెక్టులు తయారు చేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల రీజనల్ కోఆర్డినేటర్ అరుణకుమారి ఆకాంక్షించారు. సోమవారం నల్లగొండ పరిధిలోని ఎస్‌ఎల్‌బీసీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన జోనల్ స్థాయి సైన్స్ ఫేర్‌ను ప్రారంభించి మాట్లాడారు. 7 జిల్లాల నుంచి 57 పాఠశాలల విద్యార్థులు 144 ప్రాజెక్టులను తయారు చేశారని ప్రిన్సిపల్ లలితకుమారి తెలిపారు. మూడు రోజుల పాటు ఈ సైన్స్‌ఫేర్ నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

కాల్వలు పూర్తయ్యేనా!



భువనగిరిలో జాతీయ రహదారి వద్ద నిలిచిపోయిన కాళేశ్వరం కాల్వ పనులు

- ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి కావడంపై ఆశలు
- నలిపడా నిధులిచ్చి పూర్తి చేయాలంటున్న రైతులు
- సాగునీటి కాల్వలు పూర్తయితే సస్యశ్యామలం కానున్న బీడు భూములు



రామన్నపేట మండల పరిధిలో అసంపూర్తిగా ఉన్న ధర్మారెడ్డిపల్లి కాల్వ

సాక్షి, యాదాద్రి: సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి వర్గంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డికి పదవీ బాధ్యతలు చేపట్టడంతో జిల్లా రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, కాల్వలకు మోక్షం లభించనుందని ప్రజలు భావిస్తున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జలయజ్ఞంలో చేపట్టిన కొన్ని ప్రాజెక్టులు, కాల్వల పనులు కొత్త వరకు పూర్తయినా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక తిరిగి పనులు ప్రారంభించినప్పటికీ మధ్యలోనే నిలిచిపోయాయి. బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లు, ధర్మారెడ్డి, పిల్లాయపల్లి, బునాదిగాని, దేవాదుల కాల్వల పనులు నిధుల లేమితో ముందుకుసాగడంలేదు.

పూర్తికాని 'నృసింహ సాగర్'

ఆలేరు, భువనగిరి, నకిరేకల్ నియోజకవర్గాలకు సాగునీరందించే నృసింహ సాగర్(బస్వాపూర్) గంధమల్ల రిజర్వాయర్ పనులు ఇంకా పూర్తి కాలేదు. నిధుల లేమి, భూ సేకరణ సమస్యతో కాళేశ్వరం ప్రాజెక్టు, 16, 15 ప్రాకేజీల పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గతంలో సీఎం కేసీఆర్ 90శాతం పనులు పూర్తయ్యాయని ఎన్నికల తర్వాత మిగతా పనులు పూర్తి చేసి రైతులకు నీరందిస్తామని ప్రకటించారు కాని ప్రధాన కాల్వ పనులు ఇంకా పూర్తి కాలేదు. భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం, రాయిగిరి, నాగిరెడ్డిపల్లి వద్ద రోడ్డు, రైలు మార్గాల వద్ద కాల్వల పనులు నిలిచిపోయాయి. మల్లన్నసాగర్ నుంచి వచ్చే ప్రధాన కాలువ పనులు తుర్కపల్లి, యాదగిరిగుట్ట మండలాల్లో ఇంకా పూర్తి కాలేదు. భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది.



భువనగిరిలో నిలిచిన కాళేశ్వరం కాల్వ పనులు

నత్తనడకన పనులు

మూసీ నీటి వినియోగం ద్వారా జిల్లాలో సాగు విస్తీర్ణం పెంచాలన్న లక్ష్యంతో చేపట్టిన కాలువల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ధర్మారెడ్డి కాలువ, పిల్లాయిపల్లి కాల్వ, బునాదిగాని కాల్వ ఆధునీకరణ నిధుల మంజూరుతోపాటు భూ సేకరణలో జాప్యంతో కాల్వల వెడల్పు, లోతు పెంచే పనులు నిలిచిపోయాయి. యాదాద్రి భువనగిరి, నలగొండ జిల్లాల్లో మూడు కాల్వల కింద 60,862 ఎకరాల అదనంగా సాగులోకి వస్తుందని నిర్ణయించారు. ఇందుకోసం 222.11 కిలోమీటర్ల మేరకు ఆధునీకరణకు నిర్ణయించారు. ఇప్పటి వరకు 135 కిలోమీటర్ల మేర పూర్తి అయ్యింది. ఇంకా 87.11 కిలోమీటర్లు పూర్తి కావాల్సి ఉంది. అయితే 1,143 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, 760 ఎకరాలు సేకరించారు. 383 ఎకరాలు సేకరించాల్సి ఉంది. భూ సేకరణకు రూ.82 కోట్లు అవసరంగా కాగా రూ.50 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పటి వరకు మూడు కాల్వల్లో రూ.95 కోట్ల పనులు జరుగగా ప్రభుత్వం రూ.60 కోట్లు మాత్రమే చెల్లించింది. రూ.35 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉన్నాయి.

2013లో ఆధునీకరణ చేపట్టినా..

ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి, బునాదిగాని కాల్వల ఆధునీకరణకు 2013లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.320 కోట్లు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ అనంతరం రూ.280కోట్లకు పరిపాలనా ఆమోదం తెలిపింది. స్థానిక ప్రజాప్రతినిధుల కోరిక మేరకు కాల్వల ఆధునీకరణకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.284 కోట్లు మంజూరు చేసింది. 3 కాల్వలను ఒకే ప్యాకేజీ కింద రూ.222 కోట్లతో అగ్రిమెంట్ చేశారు. 2016లో నూతన డిజైన్ చేసినా పనులు పూర్తి కాలేదు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి



కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన కాల్వల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వం పనులు ప్రారంభించినప్పటికీ ఇంకా పూర్తి కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున వెంటనే కాల్వల పనులు పూర్తి చేసి రైతుల పొలాలకు సాగునీరందించాలి.
– రావి కిరణ్‌రెడ్డి, రైతు, భువనగిరి

జరిగిన పనులు ఇలా..

- ధర్మారెడ్డిపల్లి కాల్వ : ధర్మారెడ్డిపల్లి కాల్వ ఆధునీకరణ, రైతులకు భూ నష్టపరిహారం చెల్లించుటకు రూ.80కోట్లు కేటాయించారు. వలిగొండ, రామన్నపేట, చిట్యాల, నార్కట్‌పల్లి మండలాల్లో కాల్వ పొడవు 51.51 కిలోమీటర్లు కాగా 33 కిలోమీటర్ల వరకు పని పూర్తి కాగా 19 కి.మీ. పూర్తి కావాల్సి ఉంది. 40 చెరువులను నింపుతూ 17,787 ఎకరాలు అదనంగా సాగులోకి తేవాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పోచంపల్లి మండలం ధర్మారెడ్డిపల్లి మూసీకత్వ నుంచి వలిగొండ మండలం గోకారం చెరువు వరకు కాల్వ అడుగు భాగాన్ని 10మీటర్ల వెడల్పు, గోకారం చెరువు తూముల నుంచి చిట్యాల మండలం శివనేనిగూడెం వరకు 6 మీటర్లు, అక్కడినుంచి నార్కట్‌పల్లి మండలం ఏపీలింగోటం వరకు 3మీటర్ల వెడల్పు ఉండేలా డిజైన్ చేశారు. కాల్వ ఆధునీకరణకు యాదాద్రి జిల్లాలో 179.21కు 112.27 ఎకరాలు సేకరించగా 66.34 ఎకరాలు సేకరించాల్సి ఉంది. నల్లగొండ జిల్లాలో 66 ఎకరాలు సేకరించాల్సి ఉంది.
- పిల్లాయిపల్లి: రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం బండరావిరాల నుంచి చిట్యాల మండలం ఉరుమడ్ల వరకు పిలాయిపల్లి కాలువ పొడవు 66కి.మీ. పోచంపల్లి, చౌటుప్పల్, రామన్నపేట, చిట్యాల మండలాల్లోని సుమారు 22,500 ఎకరాలకు సాగునీరు నీరందించే కాలువ పనులు నిలిచిపోయాయి. పిలాయిపల్లి కాలువ నిర్మాణానికి రూ.221.99కోట్లు కేటాయించారు. రూ.66 కోట్లతో పనులు జరిగాయి. 66 కి.మీ. పూర్తి చేయాల్సి ఉంది.
- బునాదిగాని కాల్వ : బీబీనగర్, భువనగిరి, వలిగొండ, ఆత్మకూర్(ఎం), మోటకొండూరు, మోత్కూరు మండలాల్లో బునాదిగాని కాలువ పనులు నిలిశాయి. 12,700 అదనపు ఆయకట్టు కోసం 98.64 కి.మీ.మేర చేపట్టిన పనుల్లో 54 కి.మీ. పూర్తయ్యాయి. 44.04 కి.మీ మేర పనులు జరగాల్సి ఉంది. 448.28 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, 342.16 ఎకరాలు సేకరించారు. 106.11 ఎకరాలు సేకరించాల్సి ఉంది.



వలిగొండ పరిధిలో బునాదిగాని కాల్వ (ఫైల్)

దేవాదుల పనులు ఎక్కడివక్కడే..

టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన దేవాదుల కాల్వ పనులు ఇంకా సాగుతూనే ఉన్నాయి. ఆలేరు, గుండాల మండలాల రైతులకు సాగునీరిందించే కాల్వ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. జనగాం జిల్లాలోని చీటకోడూర్ రిజర్వాయర్ నుంచి దేవాదుల కాల్వతో ఆలేరు మండలం పటేల్‌గుడెం రైతులకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. 2007లో దేవాదుల కాల్వ నిర్మాణం చేపట్టారు. 15 ఏళ్లు దాటినా కాల్వ పనులు పూర్తి కాలేదు.

వైభవంగా ఆకాశ దీపోత్సవం



ఆకాశ దీపోత్సవాన్ని నిర్వహిస్తున్న ఆచార్యులు, హాజరైన ఆలయ సిబ్బంది, భక్తులు

యాదగిరిగుట్ట: కార్తీక మాసం చివరి సోమవారం, మాస శివరాత్రిని పురస్కరించుకొని యాదాద్రి అనుబంధ ఆలయమైన శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆకాశ దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్ఫటిక లింగానికి తొలుత అభిషేకం చేశారు. ఆలయ ధ్వజ స్తంభం వద్ద ప్రత్యేకంగా తయారు చేసిన దీపానికి సంప్రదాయంగా పూజలు జరిపించి, ధ్వజ స్తంభం పైకి దీపాన్ని తీసుకెళ్లి ఆకాశ దీపోత్సవం చేపట్టారు. ఈ వేడుకలో ఆలయ ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ అధికారులు, ఆచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి



టికెట్‌లు తీసుకొని మహిళలతో కలిసి ప్రయాణం చేస్తున్న కలెక్టర్, భువనగిరి ఎమ్మెల్యే కుంభం



ఆరోగ్యశ్రీ పథకం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కుంభం, కలెక్టర్ తదితరులు

సాక్షి, యాదాద్రి: అందరి సహకారంతో భువనగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగేతో కలిసి భువనగిరి బస్టాండ్‌లో మహిళలు, విద్యార్థినులు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే మహాలక్ష్మి, భువనగిరి ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు చేయూత పథకాలను ప్రారంభించి బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే మాట్లాడుతూ జిల్లాలో మహాలక్ష్మి, చేయూత పథకాలను ప్రారంభించుకున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్, ఇతర అధికారులు ఆర్టీసీ బస్‌లో మహిళలతో కలిసి జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చిన్నా నాయక్, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి పి.అమరేందర్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

భువనగిరి టౌన్: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రద్దు చేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో పునఃప్రారంభించి మాట్లాడారు. మొత్తం 25 వరకు ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు సంక్షేమ పథకాల ప్రారంభోత్సవానికి వెళ్లడంతో డీఆర్‌ఓతోపాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శేఖర్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు నాగేశ్వరాచారి, రామ్మూర్తి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణి ఉదయం 11.45 గంటలకు ప్రారంభించారు. కలెక్టరేట్‌లో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా తనకు పింఛన్ ఒక్కసారి ఇచ్చి ఇవ్వడం లేదని, ఇకనుంచైనా నెలనెలా ఇవ్వాలని ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన చుక్కల మల్లమ్మ ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. అలాగే తమ గ్రామంలో సర్వేనంబర్ 102లోని భూమిలో మా ఇళ్లు ఉన్నాయని, దాన్ని వ్యవసాయేతర భూమిగా మార్చాలని చౌటుప్పల్ మండలం చిన్న కొండూరుకు చెందిన యాదవులు విన్నవించారు.

తుది దశకు 'యూడైస్'

- 569కి 379 స్కూళ్ల వివరాలు నమోదు పూర్తి
- వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యతో నిలిచిన ప్రక్రియ
- ఇంకా నమోదు చేయాల్సిన పాఠశాలలు 190
- నేటితో ముగియనున్న గడువు



భువనగిరి: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వివరాలతోపాటు అందులో చదివే విద్యార్థులు, వారికి అందుతున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల సమాచారాన్ని యూడైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్) వెబ్‌సైట్‌లో పొందుపర్చే కార్యక్రమం జిల్లాలో తుది దశకు చేరింది. ఈ నెల 12వ తేదీ వరకే గడువు ఉన్నప్పటికీ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో వివరాల నమోదు ప్రక్రియ నిలిచిపోయింది. జిల్లాలోని అన్ని పాఠశాలల సమాచారాన్ని యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా ప్రధానోపాధ్యాయులు నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియను జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు కలిపి మొత్తం 569 ఉన్నాయి. ఇందులో 89,814 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటి వరకు 379 పాఠశాలల సమాచారాన్ని యూడైస్ ప్లస్‌లో నమోదు చేశారు. మొత్తంగా 67శాతం యూడైస్ నమోదు ప్రక్రియ పూర్తయ్యింది.విద్యార్థులు, మరుగుదొడ్లు, నీటి వసతి, తరగతి గదులు, వంట గదులు ఇతర స్థితిగతుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వీటితో పాటు ఉపాధ్యాయుల సమాచారాన్ని సైతం యూడైస్ ప్లస్‌లో నమోదు చేస్తున్నారు. వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో నమోదు ప్రక్రియ ఆగింది. ఇంకా 190 స్కూళ్ల సమాచారం నమోదు చేయాల్సి ఉంది.

నిర్ణీత గడువులోపు పూర్తి

యూడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో పాఠశాలలతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాల నమోదు ప్రక్రియ నిర్ణీత గడువులోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు ప్రక్రియను పర్యవేక్షిస్తున్నాం. యూడైస్‌లో వివరాలను నమోదు చేయటం వల్ల అందుకు అనుగుణంగా నిధులు మంజూరయ్యే అవకాశం ఉంటుంది.
–నారాయణరెడ్డి, డీఈఓ

నేటి వరకు గడువు

యూడైస్ ప్లస్‌లో పాఠశాలలు, విద్యార్థుల, ఉపాధ్యాయుల సమాచారాన్ని నమోదు చేయుటకు చివరి గడువు మంగళవారం వరకే ఉంది. నిర్ణీత గడువులోపు వివరాల నమోదు పూర్తి చేసిన తర్వాత నమోదు వివరాలను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పరిశీలించి ఎంఈఓలకు నివేదికలు అందజేస్తారు. ఎంఈఓల పరిశీలన అనంతరం డీఈఓకు పంపుతారు. డీఈఓ కొన్ని పాఠశాలల వివరాలను పరిశీలించి ఉన్నతాధికారులు అందజేస్తారు.

పల్లె పోరు డౌటే..!

- ఆరు గ్యారంటీలు అమలు చేసిన తర్వాత నిర్వహించాలని ప్రభుత్వ యోచన
- అప్పుడైతేనే కాంగ్రెస్ పార్టీకి ప్రయోజనం అంటున్న నేతలు
- పార్లమెంట్ ఎలక్షన్ అనంతరం పంచాయతీ ఎన్నికల నిర్వహణకు మొగ్గు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : గ్రామ పంచాయతీ ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు. ఇటీవలే కొత్త ప్రభుత్వం ఏర్పడడం, కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో ప్రస్తుతం వాటి అమలుపైనే ప్రభుత్వం దృష్టి సారించింది. వాటిలో రెండు పథకాలే ప్రస్తుతం ప్రారంభమయ్యాయి. మిగిలిన గ్యారంటీలను కూడా అమలు చేయాల్సి ఉంది. అవన్నీ పూర్తి చేశాక గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మేలు చేకూరుతుందనే ఆలోచనల్లో ప్రభుత్వం ఉంది. మరోవైపు పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యాక నిర్వహిస్తే బాగుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు మాత్రం ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను కొనసాగిస్తున్నా ప్రభుత్వం మాత్రం అందుకు సిద్ధంగా లేనట్లుగా తెలుస్తోంది.

ఫిబ్రవరి 1తో కాలపరిమితి పూర్తి..

రాష్ట్రంలో 2019 జనవరిలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. 2024 ఫిబ్రవరి ఒకటో తేదీతో పంచాయతీ పాలకవర్గాల కాల పరిమితి పూర్తవుతుంది. నిబంధనల ప్రకారం కనీసం 15 రోజుల ముందుగానే ఎన్నికల తతంగం అంతా పూర్తి కావాలి. అంటే జనవరిలో ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. పైగా మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఇప్పటినుంచే ఆ ప్రక్రియను ప్రారంభిస్తే తప్ప జనవరి 15వ తేదీ నాటికి ఎన్నికలను పూర్తి చేసే పరిస్థితి ఉండదు. అయితే ప్రభుత్వం ఇంత వేగిరంగా గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్లే ఆలోచనల్లో లేనట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ అధికారానికి దూరంగా ఉంది. గ్రామాల్లో పార్టీ శ్రేణులు చెల్లాచెదురయ్యాయి. ఈ పరిస్థితుల్లో పథకాల అమలు, పార్లమెంటు ఎన్నికలు పూర్తి చేసుకోవడం ద్వారా గ్రామాల్లోనూ పార్టీ శ్రేణులకు బలం చేకూర్చవచ్చనే ఆలోచనల్లో ఉన్నట్లు సమాచారం.

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు..

స్థానిక సంస్థల్లో బీసీ, ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. 6 శాతం నుంచి 10 శాతానికి ఎస్టీ రిజర్వేషన్లను పెంచడంతో పాటు బీసీలకు కూడా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని యోచిస్తుంది.

సన్నద్ధమవుతున్న అధికారులు

ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులు మాత్రం గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై దృష్టి సారించారు. ప్రభుత్వం ఒకవేళ ముందుగానే ఎన్నికలు నిర్వహించాలంటే అప్పటికప్పుడు అంటే ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతో అధికారులు ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు ఎంత మంది సిబ్బంది అవసరం తదితర వివరాలు అన్నింటిని సిద్ధం చేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికల తర్వాతే..!

లోక్‌సభ ఎంపీల పదవీ కాలం 2024 మేతో పూర్తి కానుంది. వాటికి సంబంధించి ఓటరు నమోదు వంటి ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. పార్లమెంట్ ఎన్నికల నాటికి ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేసే ఆలోచనల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. గ్యారెంటీలను పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం చేసుకోవడం ద్వారా ప్రయోజనం పొందవచ్చని ప్రభుత్వం ఎత్తుగడ. దానివల్ల ఎక్కువ మొత్తంలో ఎంపీ స్థానాలను గెలుచుకునే వీలుంటుందని నేతలు భావిస్తున్నారు. ఇప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికలు పెట్టుకుంటే పథకాల అమలు, ఎన్నికలకు సంబంధించిన వ్యూహాలు, కార్యాచరణ రూపకల్పన, అమలు వంటి వాటిలో ఇబ్బందులు తలెత్తుతాయని అనుకుంటున్నారని తెలిసింది. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలంటే కీలకమైన ఎంపీ స్థానాల ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టే ఆలోచనల్లో ఉన్నట్లుగా సమాచారం. ఆ తరువాత పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే విజయావకాశాలు కూడా కాంగ్రెస్‌కు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని.. ఆ దిశగానే ఆలోచనలు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

క్లుప్తంగా

డీసీఎం బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



రామన్నపేట శివారులో బోల్తా పడిన డీసీఎం

రామన్నపేట : నారింజపండ్ల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్‌బోల్తాపడడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. భువనగిరి నుంచి చిట్యాల వైపు సోమవారం పండ్లలోడ్‌తో వెళ్తున్న డీసీఎం లక్ష్మీగార్డెన్స్ సమీపంలోకి రాగానే అదుపుతప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో డీసీఎం బాగా దెబ్బతిన్నది. ఎస్ఐ లక్ష్మయ్య సంఘటనా స్థలానికి చేరుకొని పంచానామా నిర్వహించి కేసు నమోదు చేశారు.

రామారంలో తాళం వేసిన ఇంట్లో చోరీ

గుండాల : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. గుండాల మండలం రామారం గ్రామానికి చెందిన మల్లెపాక యాదయ్య, లక్ష్మి దంపతులు శనివారం హైదరాబాద్‌లో ఉంటున్న తమ కూతురు శైలజ వద్దకు వెళ్లారు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉండడంతో పాటు వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. సూట్‌కేసులో దాచుకున్న రూ.45 వేలు కనిపించలేదు. చోరీ జరిగిందని భావిస్తున్నారు. పది రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన మల్లెపాక పరశురాములు ఇంట్లోకి కూడా దుండగులు చొరబడి రూ.40 వేలను అపహరించుకుపోయారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ చోరీ

రామగిరి(నల్లగొండ): గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్‌ను చోరీ చేశారు. తిప్పర్తి మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూమ్‌ల సమీపంలో గల ట్రాన్స్‌ఫార్మర్ నందు డిసెంబర్ 2వ తేదీ రాత్రి 230 లీటర్ల ఆయిల్ గుర్తుతెలియని దుండగులు దొంగలించారు. దీని విలువ సుమారు రూ. 23 వేల వరకు ఉంటుంది. విద్యుత్ ఏఈ ఎస్.రమ్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిప్పర్తి ఏఎస్ఐ ఎస్.రామ్మూర్తి తెలిపారు.

ఆటో బోల్తా... ఒకరికి గాయాలు

మర్రిగూడ : ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన మర్రిగూడ మండలంలోని రాజాపేట సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాల్ నుంచి మర్రిగూడ గ్రామాల్లో బిస్కెట్స్ సప్లయ్ చేస్తున్న ఆటో మండలంలోని రాజాపేట సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ యాదగిరి భానుప్రసాద్ చేతి వేళ్లు తెగిపోయాయి. మర్రిగూడలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అతడిని హైదరాబాద్‌కు తరలించారు.

ఉద్రిక్తత నడుమ అంత్యక్రియలు

- మృతుడు సూర్య కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన
- పాలెంతండాలో భారీగా పోలీసు బలగాల మోహరింపు
- పోలీసు, రెవెన్యూ శాఖల రాతపూర్వక హామీతో శాంతించిన తండావాసులు

చింతపల్లి : భూ వివాదం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లడం.. ఎస్ఐ దురుసు ప్రవర్తనకు అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచిన నేనావత్ సూర్య(56) మృతదేహానికి సోమవారం స్వగ్రామం చింతపల్లి మండలం పాలెంతండాలో ఉద్రిక్తత నడుమ ముగిశాయి. ఓ భూ వివాదంలో చింతపల్లి ఎస్ఐ సతీష్‌రెడ్డి సూర్యను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్న క్రమంలో చెయ్యి చేసుకున్నాడు. ఈ క్రమంలో దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుండగా గుండె పోటుకు గురై మృతి చెందాడు. అయితే ఎస్ఐ కొట్టడంతోనే సూర్య మతిచెందాడని మృతుని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆదివారం రాత్రి దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు రాత్రి వారిని ఆస్పత్రి వద్దనే అడ్డుకొని నచ్చజెప్పగా సోమవారం ఉదయం మృతదేహంతో చింతపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేయాలని సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి వద్దనే భారీగా మోహరించి వారిని అడ్డుకున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పోలీసు బందోబస్తు నడుమ స్వగ్రామమైన పాలెంతండాకు తరలించారు. గ్రామంలో కూడా గ్రామస్తులు, బంధువులు భారీ ఎత్తున ఆందోళన చేపట్టడంతో రాత్రి వరకు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారిని శాంతింపజేసేందుకు ప్రయత్నాలు చేయగా వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ప్రభుత్వ భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు చేసేది లేక దేవరకొండ ఆర్డీఓను తండాకు పిలిపించారు. ఆయన కలెక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని, పోలీసు, రెవెన్యూ అధికారులు రాతపూర్వకంగా హామీనిచ్చారు. దీంతో పోలీసు పహారా నడుమ రాత్రి సూర్య అంత్యక్రియలు నిర్వహించారు.



పాలెంతండాలో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న దేవరకొండ డీఎస్పీ



చింతపల్లి మండలం పాలెంతండాలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

భారీగా మోహరించిన పోలీసులు

పాలెంతండాకు చెందిన సూర్య మృతితో చింతపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు. ఆదివారం రాత్రి నుంచే పోలీసు వాహనాలు, పోలీసులు పెద్ద సంఖ్యలో రావడంతో మండల కేంద్ర ప్రజలు ఒకింత భయాందోళనకు గురయ్యారు. ఆవేశంతో తండావాసులు పోలీస్ స్టేషన్‌పై దాడి చేయొచ్చని బలగాలను మోహరించారు.

న్యాయం చేయాలని..

దేవరకొండ: చింతపల్లి మండలం పాలెం తండాకు చెందిన నేనావత్ సూర్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్‌చేస్తూ బంధువులు సోమవారం దేవరకొండ ఏరియా ఆస్పత్రి పోస్టుమార్టం గది వద్ద కొద్దిసేపు ఆందోళనకు దిగారు. మృతదేహానికి ప్రాంతీయ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసే క్రమంలో మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దేవరకొండ డీఎస్పీ గిరిబాబు ఆస్పత్రి వద్దకు చేరుకొని మృతుడి బంధువులకు సర్దిచెప్పారు.పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ఆస్పత్రి వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



దేవరకొండ ఆస్పత్రి వద్ద మృతుడి బంధువులతో మాట్లాడుతున్న డీఎస్పీ

చెరువులో దూకి యువతి బలవన్మరణం



విజయ మృతదేహం

సూర్యాపేట క్రైం : సూర్యాపేటలోని సద్దుల చెరువులో సోమవారం ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. సూర్యాపేట పట్టణం పూలసెంటర్‌కు చెందిన బ్రహ్మదేవర ఈశ్వరయ్యకు ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తెకు వివాహం కాగా చిన్న కుమార్తె విజయ(28) ఇంటర్ వరకు చదివి మానేసింది. తండ్రి కిరాణ దుకాణం నడుపుతుండగా, తల్లి గృహిణి. విజయ కొంత కాలంగా స్థానిక హీరో షో రూంలో అకౌంటెంట్‌గా పనిచేస్తోంది. రోజు మాదిరిగానే సోమవారం ఉదయం ఇంట్లో నుంచి షో రూంకు వెళ్తున్నానని చెప్పి విజయ బయటికి వచ్చింది. షో రూంకు విజయ రాకపోవడంతో సిబ్బంది తండ్రి ఈశ్వరయ్యకు ఫోన్ చేశారు. విజయ షోరూంకు వస్తున్నానని చెప్పి వెళ్లిందనివారికి సమాధానం చెప్పాడు. సద్దల చెరువు నీటిలో మధ్యాహ్న సమయంలో గుర్తుతెలియని యువతి మృతదేహం తేలియాడుతుండడంతో బండ్‌పై నుంచి వెళ్తున్న యువకులు గమనించి పోలీసులకు సమాచారం చేరవేశారు. యువతిని బయటకు తీయిస్తుండగానే విజయ తల్లిదండ్రులు, హీరో షోరూం సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. విజయ మృతికి కారణాలు తెలియరాలేదు. పోస్టుమార్టం నిమిత్తం విజయ మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రికి తరలించారు. తండ్రి ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. మృతురాలికి సోదరి ఉంది.

భూములు కోల్పోయిన రైతులను ఆదుకోవాలి

మఠంపల్లి : మండలంలోని పెదవీడు రెవెన్యూ పరిధిలో భూములు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న నిరుపేద రైతులను ఆదుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నియోజకవర్గ నాయకుడు షేక్.ఖరీమ్ ఆధ్వర్యంలో సోమవారం సూర్యాపేట జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పెదవీడు రెవెన్యూ పరిధిలో గతంలో ఎమ్‌జీ పవర్‌ప్లాంట్ నిర్మాణం పేరుతో ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కొందరు మోసపు హామీలతో స్థానిక నిరుపేద రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి చేశారన్నారు. నేటికీ పవర్‌ప్లాంట్ నిర్మాణం చేపట్టకపోగా నిరుపేద రైతులు మాత్రం భూములు కోల్పోయి ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈవిషయమై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఆయన సూచన మేరకు పేదరైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు ఉన్నారు.



సూర్యాపేట అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెర్వుగట్టు ఆలయానికి పోటెత్తిన భక్తజనం



చెర్వుగట్టులో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, అర్చకులు శ్రీకాంత్, సురేష్, సతీష్, జగదీష్‌శర్మ, నాగయ్యలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. గట్టు పైకి వాహనాలను అనుమతించలేదు.



సత్యనారాయణ స్వామివ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అధిక సంఖ్యలో విచ్చేసిన మహిళలు

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో వివిధ ప్రాంతల నుంచి మహిళా భక్తులు గట్టుకు అధిక సంఖ్యలో వచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓ నవీన్‌కుమార్, సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్‌లు ఇంద్రసేనారెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టులో సంగారెడ్డి కలెక్టర్ పూజలు

నార్కట్‌పల్లి మండల పరిధిలోని చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామిని సంగారెడ్డి కలెక్టర్ శరత్ దంపతులు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ దంపతులకు అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. ఈఓ నవీన్‌కుమార్ సన్మానం చేసి ప్రసాదం అందజేశారు.



సంగారెడ్డి కలెక్టర్‌కు ప్రసాదం అందజేస్తున్న ఈఓ, ప్రధాన అర్చకుడు

కొప్పోలు పాఠశాలలో క్షుద్ర పూజల కలకలం


గుర్రంపోడు : గుర్రంపోడు మండలం కొప్పోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల ముందు క్షుద్ర పూజల ఆనవాళ్లు కలకలం రేపాయి. సోమవారం ఉదయమే పాఠశాలను శుభ్రం చేసేందుకు వచ్చిన అటెండర్‌కు గదుల ముందు తమలపాకులు, నిమ్మకాయలు, కుంకుమ, పసుపులను గుర్తించి హెచ్ఎం నోముల యాదగిరి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన గ్రామస్తుల, పోలీసులకు తెలియజేయగా సర్పంచ్ తిరుగుడు జ్యోతి లింగారెడ్డి, గ్రామ పెద్దలు, పోలీసులు పాఠశాలకు చేరుకుని విచారణ జరిపారు.



తరగతి గదుల ఎదుట కుంకుమ, పసుపు

అలుగు పోస్తున్న చెరువులు

శాలిగౌరారం: శాలిగౌరారం మండలంలోని ఎస్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన కందికుంట, గారెకుంట చెరువులు పూర్తిస్థాయిలో నిండి మత్తడి దూకుతున్నాయి. శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చే ప్రధాన రాచకాల్వకు ఎస్‌జి కొత్తపల్లి చెరువులు అనుసంధానమై ఉన్నాయి. ఈచెరువుల అలుగుల ద్వారా వచ్చే వరద నీరు సోమవారం సాయంత్రం నుంచి నేరుగా శాలిగౌరారం ప్రాజెక్టులోకి చేరుతుంది. శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చి చేరేందుకు నిజాం నవాబులు 1908 లో మూసీనదిపై రామన్నపేట మండలం పల్లివాడ వద్ద హెడ్‌రెగ్యూలేటర్ నిర్మించి సుమారు 35 కిలోమీటర్లు రాచకాల్వను నిర్మించారు. ఈకాల్వకు రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాలకు చెందిన పలు చెరువులు, కుంటలు అనుసంధానమై ఉన్నాయి. రాచకాల్వలో నీటితో శాలిగౌరారం ప్రాజెక్టు మినహా అనుసంధానంగా ఉన్న చెరువులు, కుంటలు నిండి అలుగులుపోస్తున్నాయి. 21అడుగుల నీటి సామర్థ్యం కలిగిన శాలిగౌరారం ప్రాజెక్టులో ప్రస్తుతం 11 అడుగుల నీటి నిల్వ ఉంది.



శాలిగౌరారం మండలంలో అలుగు పోస్తున్న గారెకుంట చెరువు

వేస్ట్ డికంపోజ్‌తో సేంద్రియ వ్యవసాయం

- కుళ్లిన ఎరువులతో నేలలో పెరగనున్న సూక్ష్మజీవుల సమూహం
- వ్యర్థాలను చల్లి భూసారాన్ని పరిరక్షించుకోవచ్చు
- పంటపై పిచికారీ చేస్తే అదుపులో ఉండనున్న తెగుళ్లు
- ఖర్చులు తగ్గి దిగుబడి పెరుగుతుందంటున్న నడిగూడెం ఏఓ రాజాగోపాల్‌రావు

నడిగూడెం : రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం యేటేటా పెరుగుతుండడంతో భూసారం తగ్గిపోతుంది. అంతేకాకుండా పంటల దిగుబడి గణనీయంగా పడిపోయి రైతులకు ఖర్చులు పెరుగుతున్నాయి. పర్యావరణ సమతుల్యత కూడా దెబ్బతింటోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా పంట దిగుబడి పెరగడంతో పాటు భూసారాన్ని పరిరక్షించుకోవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు సూచిస్తున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే....



తయారైన వేస్ట్ డికంపోజ్(కుళ్లిన వ్యర్థాలు)ను పరిశీలిస్తున్న రైతులు

వేస్ట్ డికంపోజ్

ఈ వేస్ట్ డికంపోజ్(కుళ్లిన వ్యర్థాలు) అనేక రకాల సూక్ష్మజీవుల సమూహం. ఇది హైదరాబాద్‌లో జాతీయ సేంద్రియ కేంద్రంలో 30 మి.గ్రా.బాటిళ్లలో లభిస్తున్నది. దీనిని ఒక్కసారి కొనుగోలు చేస్తే రైతులే సొంతంగా తయారు చేసుకోవచ్చు.

నేలసారం పెరుగుతుంది

కుళ్లిన ఎరువులను పంట చేలల్లో వేసుకోవడం ద్వారా నేలలో సూక్ష్మజీవుల సమూహం పెరుగుతుంది. తద్వారా నేల సేంద్రియ కర్బనం, నేల సారం, నేల ఉత్పాదకత పెరుగుతుంది. ఈ మేరకు రైతులకు ఖర్చులు తగ్గడమేకాకుండా దిగుబడులు పెరుగుతాయి. వీటన్నిటితోపాటు భూసారాన్ని కాపాడుకున్నట్లవుతుంది. పంటపై పిచికారీ చేస్తే పలు రకాల తెగుళ్లు కూడా అదుపులో ఉంటాయి.

ఎరువులుగా పంట వ్యర్థాలు

పంటను కోసిన తర్వాత మిగిలిన వ్యర్థాల అవశేషాలను కూడా సేంద్రియ ఎరువుగా మార్చుకోచ్చు. ఇలా చేయాలంటే ఆకులు, కాండాలు, చెత్తాచెదారం, పంటను నూర్పిడి చేయగా మిగిలిన భాగాలు అన్నింటినీ కలుపుకొని ఒక దగ్గర కుప్పగా వేసి వాటి మీద 100 లీటర్ల డికంపోజర్‌ను చల్లాలి. తద్వారా పంటకు సంబంధించిన అవశేషాలన్నీ 30రోజుల్లో బాగా కుళ్లిపోతాయి. ఈ వ్యర్థాలను పొలంలో చల్లడం వలన నేల సారం పెరుగుతుంది. వేస్ట్‌డికంపోజర్‌గా విచ్ఛిన్నం చేసి, ఎరువుగా మారుస్తాయి.

తయారీ విధానం

200 లీటర్ల నీటిని ఒక ప్లాస్టిక్ డ్రమ్‌లో తీసుకోవాలి. అందులో రెండు కిలోల నల్లబెల్లం కలుపుకొని 30 మి.లీ. వేస్ట్‌డికంపోజ్ మూల ద్రావణాన్ని కలపాలి. ఈ ద్రావణాన్ని ప్రతిరోజు ఉదయం, సాయంత్రం, వేళల్లో కర్రతో కలపాలి.

గుర్తించే విధానం

వారం రోజుల తర్వాత డ్రమ్‌లోని మిశ్రమంపై తెల్లని నురగ కనిపిస్తుంది. అలాగే బెల్లం రంగులో ఉన్న మిశ్రమం లేత పసుపువర్ణ రంగులోకి మారుతుంది. ఈ ద్రావణం నుంచి బాగా కుళ్లిన వాసన వస్తే డికంపోజ్ సిద్ధమైనట్లు భావించాలి.

దర్వేశిపురం వద్ద వేలం పాటలు



వేలం పాటలు నిర్వహిస్తున్న సిబ్బంది

కనగల్ : దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం వద్ద వివిధ వస్తువుల విక్రయ హక్కులు కల్పించేందుకు సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయం వద్ద లడ్డూ, పులిహోర అమ్మకానికి ఈశ్వర్ రూ.11,60,000, గాజులు అమ్ముకునేందుకు ఎం.నాగరాజు రూ.9,55,000, బొమ్మలు, కిరాణం అమ్మేందుకు ఎం.కళ్యాణి రూ.1,25,000 పాడారు. కొబ్బరికాయలు, చీరలు, ఒడిబియ్యం, పూలు, పండ్ల వేలాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మహేంద్ర కుమార్, కార్యనిర్వహణ అధికారి జల్లేపల్లి జయరామయ్య, ఎండోమెంట ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటలక్ష్మి, ఆలయ చైర్మన్ అల్లుబెల్లి నరసింహారెడ్డి, మాజీ చైర్మన్లు కె.గోపాల్‌రెడ్డి, దేప కరుణాకర్‌రెడ్డి, ఎస్.యాదగిరి, ఎంపీటీసీ శైలజసైదులు, సర్పంచ్ అంజమ్మరామచంద్రు, దేవాలయ సిబ్బంది చంద్రయ్య, లింగయ్య, లింగస్వామి, ఉపేందర్‌రెడ్డి, ఆంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి గుడిసె దగ్ధం

- రూ. 2లక్షలకు పైగా ఆస్తి నష్టం



దగ్ధమైన గుడిసె

మాడుగులపల్లి: గ్యాస్ సిలిండర్ పేలి గుడిసె దగ్ధమైంది. ఈ ఘటన మాడుగులపల్లి మండలంలోని గోపాలపురం గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపురం గ్రామానికి చెందిన చెందిన కొండేటి వెంకటయ్య భార్య పార్వతమ్మ సోమవారం పాలు కాచేందుకు ఇంట్లోని గ్యాస్ స్టౌ వెలిగించింది. అప్పటికే గ్యాస్ లీక్ కావడంతో సిలిండర్ నుంచి మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన పార్వతమ్మ ఇంట్లో నుంచి బయటకు పరుగు తీసింది. కాసేపటికి సిలిండర్ పేలి గుడిసెకు మంటలు అంటుకొని పూర్తిగా కాలిపోయింది.నీ ప్రమాదంలో బీరువాలో దాచిన రూ.2 లక్షల నగదు, బంగారం, బియ్యం, దుస్తులు, నిత్యావసరాలు కాలిబూడిదయ్యాయి. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

లేత వరినారే శ్రేయస్కరం

- నాటు వేయడానికి 3 వారాల ముందు నుంచే పొలం సిద్ధం చేసుకోవాలి
- నారు తలలు తుంచి నాటడం మంచిది
- కాంప్లెక్స్ ఎరువులను దుక్కిలోనే వేసుకోవడం ఉత్తమం
- పెద్దవూర ఏఓ కె.సందీప్

పాడి పంట

పెద్దవూర: వానాకాలం సీజన్‌లో సాగు చేసిన వరి కోతలు పూర్తి కావచ్చాయి. ఇప్పటికే యాసంగి సీజన్‌కు రైతులు వరి విత్తనాలు తెచ్చి నార్లు పోసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ యేడాది యాసంగిలో నాగార్జునసాగర్ జలాశయంలో నీరు లేకపోయినా, బోర్లు, బావులు, చెరువుల కింద ఆయకట్టు రైతులు వరి సాగును అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వరినారు పెంచడం ఒక ఎత్తు అయితే, నారును జాగ్రత్తగా పొలానికి తరలించి నాటడం మరో ఎత్తు. నాట్లు వేసే సమయంలో రైతులు ఎలాంటి యాజమాన్య పద్ధతులు పాటించాలనే విషయాలను పెద్దవూర మండల వ్యవసాయ అధికారి కె.సందీప్ వివరించారు.

దున్నడమే ప్రధానం

వరినాట్లు వేయాలంటే పొలాన్ని దాదాపు మూడు వారాల ముందు నుంచే తయారు చేసుకోవాలి. ట్రాక్టర్‌తో, నాగలితో గానీ ఒక సాలు దున్నిన తర్వాత నాలుగైదు రోజులకు మరో సాలు చేయాలి. దీనివలన కలుపు మొక్కలు బురదలో కూరుకుపోయి, పంటకు ఎరువుగా ఉపయోగపడతాయి. అదే హడావుడిగా పొలాన్ని సిద్ధం చేస్తే కలుపు మొక్కలు, వరి మొక్కలతో సమానంగా పెరిగి పంటను దెబ్బతీస్తాయి. పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ వేస్తే వాటిని కలియదున్నే సమయంలో 50కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వేయాలి. దీనివలన పచ్చిరొట్ట ఎరువులు త్వరగా చివికి, వరి మొక్కలకు ఎరువులను అందిస్తాయి.



వరినారును కట్టలుగా కడుతున్న కూలీలు

దమ్ము చేయాలి

పొలాన్ని దున్నిన తర్వాత చదును చేసేందుకు ట్రాక్టర్‌తో దమ్ము చేయాలి. దమ్ము బాగా చేస్తే నీటి వృథాను అరికట్టడంతో పాటు, కలుపు కూడా అదుపులో ఉండే అవకాశం ఉంది. సాగు నీరు పెట్టినప్పుడు పొలం అంతటికీ నీరు అందుతుంది. చివరి దుక్కిలోనే ఆయా ప్రాంతాలకు సిఫారసు చేసిన నత్రజని, భాస్వరం, పొటాష్‌ను ఇచ్చే ఎరువులను వేయాలి. రైతులు కాంప్లెక్స్ ఎరువులను వాడదలుచుకుంటే దుక్కిలోనే వేసుకోవాలి. వరిలో పైపాటుగా వేసిన కాంప్లెక్స్ ఎరువులను మొక్కలు సమర్థంగా వినియోగించుకోలేవు. దమ్ములో జింక్, భాస్వరం ఎరువులను ఒకేసారి వేయకుండా 2 నుంచి 3రోజుల తేడాతో వేసుకోవాలి. అలాగే ప్రధాన పొలం గట్లపై ఉన్న కలుపు మొక్కలను, గడ్డిని తొలగించాలి.

ముదురు నారైతే కుదుళ్ల సంఖ్య పెంచుకోవాలి

నాట్లు వేయాలంటే నారు ఆరోగ్యంగా ఉండాలి. 4 నుంచి 6 ఆకులు కలిగిన నారు పొలంలో నాటు వేసేందుకు అనుకూలం. పొలాన్ని బురద బురదగా తయారు చేసి, అందులో పైపైన 2 నుంచి 3 సెం.మీ.ల లోతులో నాట్లు వేయడం మంచిది. వరి నారును లోతుగా నాట్లు వేస్తే పిలకల సంఖ్య కూడా తగ్గిపోతుంది. కుదురుకు 2 నుంచి 3 మొక్కలు నాటవచ్చు. నాటేటప్పుడు నారు తలలు తుంచి నాటుకోవడం మంచిది. ఎందుకంటే పొడవాటి నారు మొక్కల చివరి ఆకులు వాలిపోయి, బురదకు అంటుకు పోవడం వలన ఆకులను ఆశించే తెగుళ్లు వేగంగా వృద్ధి చెందుతాయి. ఆకులను కత్తిరించకుండా ఉండాలంటే ఆరోగ్యవంతమైన నారును సరైన వయసులో నాటుకోవడం ఉత్తమం. నాట్లు ఆలస్యమై ముదురు నారు నాటాల్సి వస్తే కుదుళ్ల సంఖ్య పెంచుకోవాలి. వత్తుగా నాటడం వలన మొక్కలు బలహీనంగా ఉండి, ఎక్కువగా పెరిగి పడిపోయే అవకాశం ఉంటుంది. మొక్కలు సమాన దూరంలో ఉంటేనే లాభదాయకం. లేత నారు నాటడం అన్ని విధాలా శ్రేయస్కరం.

నీటి యాజమాన్యం పాటించాలి

నాట్లు పూర్తయిన తర్వాత పొలంలో 20రోజుల వరకు స్వల్పంగా అంటే 5 సెంటీమీటర్ల నీరు ఉండాలి. సక్రమ నీటి యాజమాన్యం పాటిస్తే సకాలంలో పిలకలు వచ్చి దిగుబడి బాగుంటుంది. సాగు నీరు స్వల్పంగా ఉంటే సుడిదోమ, లద్దె పురుగు తాకిడి ఎక్కువగా ఉండదు. నాట్లు వేసిన పొలంలో ఎప్పుడూ నీరు ఉండేలా చూసుకోవాలి. నీటి తడి ఆరిపోతే కలుపు మొక్కలు ఎక్కువగా వస్తాయి. రసాయన ఎరువులు వేసేటప్పుడు పొలంలో నీరు స్వల్పంగా ఉండేలా చూసుకోవాలి. నాటిన వారం పది రోజులకు పిలకలు తొడగడం ప్రారంభమై, 50 నుంచి 60 రోజులకు వరి గరిష్ఠ పిలకల స్థాయికి చేరుకుని మంచి దిగుబడులు వస్తాయి.